క్లుప్తంగా

ప్రతి సమస్య పరిష్కరిస్తాం: మంత్రి లోకేశ్



తాడేపల్లిరూరల్: ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బుధవారం ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆయన నివాసంలో మంగళగిరి నియోజకవర్గంలోని ప్రజలు లోకేశ్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికి 22 రోజుల నుంచి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ ఇబ్బందుల్ని వినతిపత్రాల రూపంలో అందజేశారని తెలిపారు. మంగళగిరి పరిధిలో ఓ మహిళ రోడ్డు విస్తరణలో ఇంటిని కోల్పోయిందని, ఆ విషయాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు. పలు భూ కబ్జాలపై వినతిపత్రాలు వచ్చాయని, వాటిని అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ధ్రువపత్రాల పంపిణీ



తాడికొండ: మండలం లాం గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేసుకున్న 19 మంది క్యాడెట్లకు బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో ఎనిమిది మందికి ఏ గ్రేడ్, ఎనిమిది మందికి బీ గ్రేడ్, ఒకరికి సీ గ్రేడ్ ఉత్తీర్ణత పత్రాల్ని 25వ బెటాలియన్ కమాండెంట్ తరుణ్ పను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి, సీటీవో తిరుమల ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కృష్ణాయపాలెం వద్ద బుధవారం జరిగింది. ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలేనికి చెందిన శ్రీనివాస్ హైకోర్టు ఆవరణలోని క్యాంటీన్‌లో పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై అక్కడకు వెళుతుండగా, కృష్ణాయపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌ను పోలీసులు 108లో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయపడిన ఘటన ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారధిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మలతోటి గోపీచంద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో కళాశాలకు వెళ్లేందుకు బుధవారం ఉదయం మంగళగిరిలోని ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. 10.30 గంటలకు వారధిపై ఉన్న చెక్‌పోస్టు సమీపానికి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో గోపీచంద్ కిందపడిపోవడంతో తలకు గాయమైంది. అతడ్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

11న ఉచిత వైద్య సలహా శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహిస్తున్న స్పెషలిస్టుల ఉచిత వైద్య శిబిరంలో భాగంగా ఈనెల 11న 'ప్రోస్టేట్ గ్రంథి వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం- శాస్త్రీయ అవగాహన' సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్, పావులూరి రమేష్ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8గంటల నుంచి 12 వరకు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే ఈ శిబిరంలో వైద్య, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మొహిస్సిన్ కాద్రీ ప్రసంగంతో పాటు వైద్య సలహాలు అందజేస్తారని పేర్కొన్నారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఒక టీంగా ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. క్విజ్ పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ. 5వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు.

జల దిగ్బంధంలో గ్రామాలు

- జోరున వర్షంతో ప్రజల ఇక్కట్లు
- రాకపోకలు నిలిపివేత
- నీట మునిగిన పత్తి, మిర్చి పొలాలు



రాకపోకలు నిలిచిన కండ్రిక రైల్వే అండర్ బ్రిడ్జి



నుదురుపాడు వాగు బ్రిడ్జిపై పొంగుతున్న నీరు

ఫిరంగిపురం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, మిరప పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని చోట్ల మొక్కలు పూర్తిగా నీట మునిగాయి. రైతులు నీటిని బయటకు వెద పెడుతున్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి నుదురుపాడు గ్రామం చివరనున్న లోతట్టు బ్రిడ్జి పైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జికి అవతల ఇళ్లు నిర్మించుకున్న వారు గ్రామంలోకి వచ్చేందుకు అవకాశం లేకుండా ఉంది. దీంతో వారు చుట్టూ తిరిగి కర్నూలు, గుంటూరు రాష్ట్ర రహదారిమీదుగా మూడు కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి. బ్రిడ్జి అవతలవైపుగా జెడ్పీ పాఠశాల ఉండటంతో విద్యార్థులు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు. బేతపూడి, గుండాలపాడు గ్రామాలకు మధ్యలో ఉన్న బ్రిడ్జిపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కూలీలు, విద్యార్థులు నానా ఇబ్బందులుపడ్డారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీరు

ఫిరంగిపురం నుంచి కండ్రిక వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జిపై పది అడుగుల లోతులో నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో రైల్వే అధికారులు రాకపోకలు నిలిపివేస్తున్నట్లుగా బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. వేమవరం వెళ్లే దారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జివద్ద ఏడు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు 113 తాళ్లూరు మీదుగా 12 కిలోమీటర్లు దూరం ప్రయాణించి ఫిరంగిపురం వస్తున్నారు.

ఆరోగ్యనగర్ వాసుల ఇక్కట్లు

ఫిరంగిపురం నుంచి ఆరోగ్యనగర్, జగనన్న కాలనీలకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు రైల్వే పట్టాలమీదుగా గ్రామంలోకి నిత్యావసరాల కోసం రావాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలు మునక

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో గడిచిన 24 గంటల్లో 72.6 మిల్లీ మీటర్ల శాతం వర్షపాతం నమోదైంది. బుధవారం తెల్లవారుజామున పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు నివాసితులు భయపడిపోతున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ఎర్ర క్వారీ, తెల్ల క్వారీ, జిల్లా పరిషత్ పాఠశాల, ఉండవల్లి సెంటర్‌లోని పలు రహదారులపై భారీగా వర్షపు నీరు, మురుగునీరు వచ్చి చేరడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుల్లో పలుచోట్ల అండర్ పాస్‌లలో వర్షపు నీరు చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందుకున్న కార్పొరేషన్ సిబ్బంది గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు. మరో రెండు రోజులు నిరంతరం పనిచేస్తే తప్పా బయటకు పంపలేమని ఇంజనీరింగ్ సిబ్బంది తెలియజేశారు. తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఎప్పటికప్పుడు కమిషనర్ అలీమ్‌బాషా శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. సచివాలయంలో పనిచేసే అన్ని శాఖల సిబ్బందిని ఇంటింటికీ పంపించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేయిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

దుగ్గిరాల మండలంలో పొంగిన కాల్వలు

మండలంలో 45.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రామాల్లో మురుగునీటి కాల్వలు పొంగి పైకి రావడంతో రోడ్లన్నీ చెత్తాచెదారంతో నిండిపోయాయి. రైతులు భారీగా వర్షం పడడంతో పొలాల్లో వరి నాట్ల ప్రక్రియను ప్రారంభించారు. మరో 24 గంటలు వర్షం పడే సూచనలు ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో విష జ్వరాలు వ్యాపించాయి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలు మరలా వర్షాలు కురుస్తుండడంతో ఎటువంటి రుగ్మతలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

కూలిన పూరింటి గోడ

ముగ్గురికి గాయాలు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు కాలనీలో ఓ పూరింటి గోడ రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు నాని కూలిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో టి. రవికుమార్, చిన్నారులు అనన్య, నిత్యశ్రీలకు గాయాలయ్యాయి. దీంతో వారు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ నాంచారయ్య సిబ్బందితో పరిశీలించారు. పూర్తి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు తెలిపారు.



పరిశీలిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య



ఫిరంగిపురంలో ఓ పత్తి పొలంలో నిలిచిన నీరు



నులకపేట ఎర్ర క్వారీలోకి వచ్చి చేరిన వర్షపు నీరు



పెదకొండూరులో వరినాట్లు ప్రారంభించిన రైతులు

అవయవ దానంతో మరణించినా జీవనం



అవయదానంపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కనున్న నిర్మల ఫార్మసీ కళాశాలలో ఈ నెల 1నుంచి 15వరకు జాతీయ సేవా పథకం, అవయ దాతల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ వి. దివ్య తేజోమూర్తి, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ జి. సీతామహాలక్ష్మి, అవయ దాతల సంఘం నుంచి గుంటూరు జీజీహెచ్ డాక్టర్ రమణ యశస్వీలు అతిథులుగా హాజరై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయ దానం వల్ల మనిషికి పునర్జన్మ లభించినట్లు అవుతుందన్నారు. అవయదానం వల్ల మరణించినా జీవించవచ్చని తెలిపారు. అనంతరం అవయదానంపై నిర్వహించిన పోస్టర్ కాంపిటీషన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించారు. న్యాయనిర్ణేతగా ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు జి. నరసింహారావు వ్యవహరించి, విజేతల్ని ప్రకటించారు. భాగ్యశ్రీకి ప్రథమ, ఎం. భార్గవి ప్రియకు ద్వితీయ స్థానం లభించింది. అనంతరం ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి అవయదానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రోగ్రాం ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, ఆర్. నరసింహ నాయక్ పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు



చక్రధారి ప్రభూజీని సత్కరిస్తున్న ఇన్‌చార్జి డీన్ కె.ఆర్.ఎస్ ప్రసాద్ తదితరులు

తాడేపల్లి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని విజయవాడ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు, ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి హెచ్.జి. చక్రధారి ప్రభూజీ విద్యార్థులకు సూచించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ యూనివర్సిటీలో బుధవారం ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల వ్యతిరేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మాదక ద్రవ్యాల ఉచ్చులో చిక్కుకుని నేటి యువత జీవితాన్ని నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు, చక్కని నడవడిక అలవరచుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ మత్తుతో భవిష్యత్ చిత్తు అవుతుందని తెలిపారు. మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని సూచించారు. అనంతరం హెచ్.జి. చక్రధారిని మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ స్టూడెంట్స్ అఫైర్ డాక్టర్ పి. శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త పి. సురేష్ పాల్గొన్నారు.

రేపు జిల్లావ్యాప్తంగా 'క్విట్ కార్పొరేట్' డే

వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

లక్ష్మీపురం: క్విట్ ఇండియా డే సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ కార్మిక రైతు సంఘ కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతాంగం సంవత్సరం పాటు ఢిల్లీలో ఆందోళన నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యల్ని పరిష్కరిస్తామని, పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీలు తగ్గించారని, క్రిమి సంహారక మందుల అమ్మకంలో వ్యాపారస్తులకు అనుకూలమైన విధానం రూపొందించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి ఉపాధి కూలీల పొట్ట కొట్టారని ఆరోపించారు. ఆహార భద్రత విషయంలో కూడా బడ్జెట్లో నిధులు తగ్గించారని తెలిపారు. ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదానీ,అంబానీల కోసం పని చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఇండియా డే సందర్భంగా ఆగస్టు 9వ తేదీన క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని వివరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరిగాని శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ స్థలాల్లో ఆక్రమణల పర్వం

- దర్జాగా టీడీపీ నాయకులు కబ్జా
- రోడ్డు వెంట స్థలాల ఆక్రమణ
- గుడిసెలు వేసి అమ్మకం
- పట్టించుకోని అధికారులు



ఆర్ అండ్ బీ స్థలాన్ని ఆక్రమించి వేసిన రేకులు షెడ్డు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కారొరేషన్ పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలు వద్ద ఆర్ అండ్ బీ స్థలాల్లో ఆక్రమణల పర్వం మొదలైంది. స్థానిక టీడీపీ నాయకులు అండతో చోటా నాయకులు ఆక్రమించి గుడెసెలు, రేకులు షెడ్డు వేసి పేదలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ స్థలం అని తెలియని కొందరు అమాయకులు తక్కువ ధరలకు ఇళ్లు వస్తున్నాయనే ఆశలతో కొని మోసపోతున్నారు. ఒక్కో సెంటు రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఆయా ప్రభుత్వ స్థలాల్ని గుర్తించి, అక్కడ ఫిష్ ఆంధ్ర దుకాణాలు ఏర్పాటు చేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక యర్రబాలెం టీడీపీ నాయకులు ఫిష్ ఆంధ్ర దుకాణాలను తొలగించడంతో ఆక్రమణల పర్వం ప్రారంభమైంది. స్థలాల ఆక్రమణలపై స్థానికులు పంచాయతీ అధికారులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని పేదలు నష్టపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారుల్ని వివరణ అడిగేందుకు ప్రయత్నించగా.. మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయిన అనంతరం ఆక్రమణలపై పట్టణ ప్రణాళిక విభాగం చర్యలు తీసుకోవాలని, తమకు సంబంధం లేదని చెబుతుండడం విశేషం. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మాత్రం సచివాలయంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ తప్పుకుంటున్నారు.

నిబద్ధతతో పనిచేసే ఉద్యోగుల సేవలు శాశ్వతం

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



లక్ష్మీపురం: ఉద్యోగులు ఎన్ని ప్రాంతాలు మారినా, వారు అందించిన సేవలు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయని సెంట్రల్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధునరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో ఒకేసారి ఇద్దరు ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు బదిలీ సందర్భంగా బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్ర కుమార్ ధృవ్ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్ర కుమార్ ధృవ్ మాట్లాడుతూ కమిషనర్ సూచనలతోనే తాము ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. విధి నిర్వహణలో ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. అనంతరం ఇద్దరు ఉన్నతాధికారుల్ని కమిషనర్, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రశాంత్ కుమార్, జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు రవికుమార్, సీతారామరాజు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత ప్రదర్శన



చేనేత వస్త్రాలను ధరించిన అధ్యాపకులు, విద్యార్థినులతో ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఆధ్వర్యంలో పెడన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత కార్మికుల్లో కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలని కోరారు. చేనేత వస్త్రాల ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి విద్యార్థినులతో రీల్స్ చేయిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల జీవితాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థినులకు పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో రూ. లక్ష విలువలైన వస్త్రాలు అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు చేనేత వస్త్రాల్నిధరించి ఆకట్టుకున్నారు.

హెచ్ఐవీ బాధితులకు హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్: హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వాడే వారు ఉచిత హైపర్ టెన్షన్ పరీక్షలు చేయించుకుని సకాలంలో మందులు వాడటం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు గోరంట్లలోని ఏఆర్టీ సెంటర్‌లో బుధవారం హెచ్ఐవీ బాధితులకు హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 'సేఫ్ కేర్ సెల్ఫ్ కేర్' అనే నినాదంతో ఏఆర్టీ మందులు వాడే ప్రతి ఒక్కరూ రక్తపోటును పరీక్షించుకోవాలని సూచించారు. ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ ప్రతి రోజూ ఏఆర్టీ మందులు కోసం వచ్చేవారికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హెపటైటిస్ బీ పరీక్షలు చేసి వ్యాధి సోకకుండా అందరికీ ఉచిత టీకా వేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడి వైరస్‌ను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. దీనిపై పోస్టర్లతో ప్రచారంతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్న కుమార్, ఏఆర్టీ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుల గణనతోనే బీసీల అభ్యున్నతి



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కుల గణన చేపట్టాలని బీసీ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎంపీ రమణయ్య డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని బీసీ ఉద్యోగ సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఓబీసీ రిజర్వేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి శివపూర్ణయ్య మాట్లాడుతూ బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం కుల జనగణన చేపట్టడం ఎంతో ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర కోశాధికారి కట్టిబోయిన నరసింహారావు మాట్లాడుతూ దేశంలో ఏదైనా జాతి, కులం అభివృద్ధి, వెనుకబాటుతనాల్ని గణాంకాల సహా తెలుసుకునేందుకు కుల గణన అవసరమని పేర్కొన్నారు. గౌరవ సలహాదారు దేవ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులు జువ్వా జ్ఞానేశ్వరరావు, బాల తాతయ్య, సాంబశివరావు, సాయి పాల్గొన్నారు.

బీసీల జీవితాల్లో వెలుగులు నింపిన మండల్

నెహ్రూనగర్: బీసీల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బీపీ మండల్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆగస్టు 7న బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన రోజును పురస్కరించుకుని బుధవారం పాత గుంటూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నూటికి 60శాతం ఉన్న బీసీల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం నడిపిన నాయకుడు బీపీ మండల్ అని కొనియాడారు. బీసీల కోసం 40 డిమాండ్లను కేంద్రం ముందుంచగా వాటిలో కొన్నింటిని మాత్రమే అమలు చేశారని తెలిపారు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు నివాళులు



నెహ్రూనగర్: కామ్రేడ్ గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి ప్రతిభతో ఉన్నత స్థానానికి ఎదిగారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాశీం పేర్కొన్నారు. ఉన్నత జీవితాన్ని కాదని బి. నరసింగరావు సాన్నిహిత్యంలో కవిగా రూపుదిద్దుకుని సాహిత్య రంగంలో ఉన్నతమైన, ఆదర్శనీయమైన కవిగా ఎదిగారని తెలిపారు. చుండూరు అమర వీరుల 33వ వర్ధంతి సభ, ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను మంగళవారం రాత్రి దళిత, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. సాహితీ విమర్శకులు జి. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ చుండూరు అమరుల విషయంలో ధనిక వర్గం, పెత్తందారులు, అగ్రకుల పార్టీలు న్యాయస్థానాలను సైతం మేనేజ్ చేసి న్యాయం జరగకుండా కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా గద్దర్, జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.